

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం

08 అక్టోబర్ 2025 పేజీలు : 08




# ఆదర్శప్రాయుడు ఆదికవి మహర్షి వాల్మీకి

## వాల్మీకి జయంతి సందర్భంగా నివాళులర్పించిన ఎస్పీ

*నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :*

వాల్మీకి జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రామాయణంను రచించిన గొప్ప వ్యక్తి వాల్మీకి.. రామాయణ కర్త వాల్మీకి సగుణ ధర్మంతో మహర్షిగా రూపాంతరం చెందడమేకాక ఆది కవిగా ఎంతో గౌరవించబడి, సాంప్రదాయ రచయితగా కీర్తించబడ్డారని కొనియాడారు. ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే మధుర కావ్యం రామాయణం అని, రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలని తెలియజేశారు. ఆధునిక సమాజంలో మనం ఉపయోగించే ప్రసార కౌశలాలు, కార్యనిర్వహణ కౌశలాలు, ప్రశాసనం, నగర, గ్రామీణ నిర్మాణ యోజన, సార్థకమైన వ్యూహరచన నిర్మాణం, అంతరిక్ష రక్షణా పద్ధతి, యుద్ధ వ్యూహరచన మొదలైన వాటికి రామాయణ నిధి వంటిదని, ఇంత విలువైన సత్యాలను చెప్పి ఇంతటి మహత్తర కావ్యాన్ని అందించిన కవి శ్రీ వాల్మీకి మహర్షి అడుగుజాడల్లో అందరూ నడవాలని సూచించారు. ఈ సందర్భంగా వారు ప్రబోధించిన ఆశయాలను, పవిత్రమైన ఆలోచనలను ప్రతి ఒక్కరూ జ్ఞప్తి చేసుకోవాలని ఎస్పీ తెలియజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య, ఎస్‌బి డిఎస్పి శ్రీనివాసరావు, రూరల్ డిఎస్‌పి శ్రీనివాసరావు, కావలి డిఎస్‌పి శ్రీధర్, ఆత్మకూరు డిఎస్పి వేణుగోపాల్, డీఎస్పీ ఏఆర్ చంద్రమోహన్, ఏవో చంద్రమౌళి, ఆర్ఐ వెల్ఫేర్ రాజారావు, పోలీస్ కార్యాలయ సూపరింటెండెంట్స్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పరిమితులు దాటుతున్న

# ఉచితాలు



- ప్రభుత్వాలు జాగ్రత్తగా ఉండాలి
- మాజీ ఉప రాష్ట్రపతి
- వెంకయ్యనాయుడు హెచ్చరిక

*వెంకటాచలం, మేజర్‌న్యూస్ :*

మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు దేశ రాజకీయాలు, ప్రభుత్వాల ఆర్థిక విధానాలు, ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణపై పలు ముఖ్య వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టులో ఇటీవల చోటు చేసుకున్న ఘటనపై ఆయన స్పందిస్తూ.. ఆ సంఘటన బాధాకరం అని, సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని, ఇది చీఫ్ జస్టిస్ వ్యక్తిగత విషయం కాదు, సమాజం.. వ్యవస్థకు సంబంధించిన అంశం అని పేర్కొన్నారు. పార్టీ మార్పుల అంశంపై మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు పార్టీ మారదలిస్తే, ఆ పార్టీ ద్వారా పొందిన పదవిని వదిలి రాజీనామా చేయాలన్నారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌ను సవరించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ మారి మంత్రులుగా కొనసాగడం చట్ట విరుద్ధం అన్నారు. చట్టానికి అతీతంగా ఎవరూ ఉండరాదని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చే ఉచితాల విషయంలో ప్రభుత్వాలు జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ప్రజల సంక్షేమం పేరుతో ఇచ్చే ఉచితాలు పరిమితులు దాటుతున్నాయన్నారు. ప్రభుత్వాలు తమ తహతికి మించి అప్పులు చేస్తుండడం ఆందోళనకరం అన్నారు. ఇరిగేషన్, పవర్ వంటి ఉత్పాదక ప్రాజెక్టుల కోసం అప్పులు చేయవచ్చు, ఎందుకంటే అవి రాబడి ఇస్తాయని, కానీ అప్పులు తెచ్చేటప్పుడు వాటిని ఎలా తీర్చబోతున్నారో అసెంబ్లీలో చర్చించాలన్నారు. అలాగే ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులపై వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పనిసరి అని సూచించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటం ప్రతి భారత పౌరుడి బాధ్యత అని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ మన దేశంలోనే ఉందని, భారత

-మిగతా 2లో

## జిల్లా పోలీసు అధికారులతో

# ఐజీ సమీక్ష





జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి మంగళవారం జిల్లా ఎస్పీ డాక్టర్ అజితా వెజెండ్లతో కలిసి జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

లోపల పేజీలో

## సర్వోన్నత న్యాయమూర్తిపై దాడిని నిరసిస్తూ..

# లాయర్స్ నిరసన




*నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :*

సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయిపై సుప్రీంకోర్టు న్యాయవాది పబ్లిక్ కోర్టులో బూటు విసిరి దాడికి పాల్పడినాడన్న సంఘటన నిరసిస్తూ.. నెల్లూరు జిల్లా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది ఎస్.అంకయ్య, కార్యదర్శి, సీనియర్ న్యాయవాది చుక్కా రమేష్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి సంఘటన ఖండించారు. ఈ సందర్భంగా

-మిగతా 2లో



## నేడు న్యాయవాదుల

# కోర్టు విధులు బహిష్కరణ


*నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :*

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై కోర్టులో జరిగిన దాడిని నిరసిస్తూ.. బుధవారం కోర్టు విధులు బహిష్కరించాలని నెల్లూరు న్యాయవాదులు మంగళవారం నిర్ణయించారు. బార్ అసోసియేషన్ హాల్లో అత్యవసరంగా జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కోర్టు విధుల బహిష్కరణ కార్యక్రమానికి న్యాయవాదులు అందరూ సహకరించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు పులిమి అయ్యప్పరెడ్డి న్యాయవాదులను కోరారు.

# జిల్లా పోలీసు అధికారులతో ఐజీ సమీక్ష



నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ : జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి మంగళవారం జిల్లా ఎస్పీ డాక్టర్ అజితా వెజెండ్ల తో కలిసి జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రస్తుత పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలను ఆయన ఆరా తీసి పలు సూచనలు చేశారు. ప్రాపర్టీ, రౌడీ ఎలెమెంట్స్, గాంజా, మిస్సింగ్ కేసులు, పోక్సో, మహిళలపై జరిగే నేరాలు నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వారిని ఆదేశించారు. రాత్రి పగలు డ్రోన్ పెట్రోలింగ్ ముమ్మరంగా చేయాలని, బేసిక్ పోలీసింగ్ అమలు చేయాలని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి వివరించి ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించి ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా విజువల్ పోలిసింగ్, విలేజ్ విజిట్ చేసి ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. అంతేకాకుండా గ్యాంబ్లింగ్ ఆడే వారితోపాటు నిర్వాహకులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, సోషల్ మీడియా వేదికలలో ఇష్టానుసారం పోస్టులు పెట్టే వారిపై పోలీస్ శాఖ నిరంతరం నిఘా ఏర్పాటు చేశామని, అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించి.. ప్రమాదాలు ఎక్కువగా జరిగే సమయంను, ప్రాంతాలను విశ్లేషించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్పీ అజితా వెజెండ్ల జిల్లాలో తీసుకుంటున్న ప్రణాళికలు, ముందస్తు చర్యల గురించి ఐజికి వివరించారు. జిల్లా అధికారులకు తమ అమూల్యమైన సలహాలు సూచనలు అందించిన ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠికి ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య, సబ్ డివిజన్, ఎస్‌బి, ఏఆర్ డిఎస్‌పి, పిసిఆర్, డిసిఆర్బి, సైబర్ సీఐలు పాల్గొన్నారు.





# కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి

నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ : భారతీయ సంస్కృతి, నీతి, ధర్మం, సత్యం, కరుణ వంటి విలువలతో కూడిన అత్యద్భుతమైన రామాయణ మహా కావ్యాన్ని ప్రపంచానికి అందించిన మహర్షి వాల్మీకి అని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో సర్వమానవాళికి మార్గదర్శకుడైన ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత అధికారులు, బిసి సంఘాల నాయకులు జ్యోతిప్రజ్వలన చేసి, వాల్మీకి మహర్షి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ వాల్మీకి జీవిత విశేషాలను క్లుప్తంగా వివరించారు. అనంతరం జేసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మానవుని జీవన విధానానికి, ధర్మపాలనకు నిలువెత్తు సాక్షాత్కారం రామాయణమని, 23 వేల శ్లోకాలతో, ఏడు ఖండాలతో రామాయణ పవిత్ర మహాకావ్యాన్ని మనకు అందించిన గొప్ప మహర్షి వాల్మీకి అని కొనియాడారు. వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని, సాధారణ మనిషి నుంచి ఒక మహా ఋషిగా ఎదిగి, మనుషులు మహా ఋషులవుతారని నిరూపించిన వాల్మీకి జీవిత చరిత్ర ఒక ఉదాహరణ అని ఆయన అన్నారు. పలు బీసీ సంఘాల నాయకుల విజ్ఞప్తి మేరకు నగరంలో బీసీ భవన్ పూర్తి చేసేందుకు కృషి చేస్తామని, ఈ సమస్య పరిష్కారంపై సీఎం సానుకూలంగా ఉన్నారని చెప్పారు. అలాగే నగరంలో వాల్మీకి మహర్షి విగ్రహం, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు మొదలైన బీసీ సంఘాల నేతలు సూచించిన పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ.. వాల్మీకి మహర్షి కేవలం కవి మాత్రమే కాదు, సమాజ పునర్నిర్మాణకారుడు, ఆదర్శమూర్తి అని పేర్కొన్నారు. ఆయన చూపించిన సత్యధర్మ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలో వాల్మీకి విగ్రహం, వాల్మీకి భవనం ఏర్పాటు చేయాలని, బీసీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని విన్నవిస్తూ జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డిఆర్వో విజయ్ కుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, బీసీ సంక్షేమ సంఘ నాయకులు నల్లబోతుల వెంకటేశ్వర్లు, దేవరాల సుబ్రహ్మణ్యం, బిసి కోటయ్య, జనార్ధన్, కాలేషా, బుధవారపు బాలాజీ, పిఎల్ రావు, మురళీకృష్ణ, వసతి గృహ సంక్షేమ అధికారులు, బీసీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ వారియర్ అవార్డు అందుకున్న పద్మావతి



నెల్లూరు కార్పోరేషన్, మేజర్ న్యూస్ : "స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర ఫ్లాగ్‌షిప్ కార్యక్రమం"లో భాగంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున నిర్వహించిన "స్వర్ణ ఆంధ్ర అవార్డుల కార్యక్రమం" సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు వేదికగా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి విభాగాల్లో విశిష్టమైన సేవలను అందించిన వారికి అవార్డులు ప్రదానం చేశారు. అందులో భాగంగా, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన శానిటరీ వర్కర్ టి. పద్మావతికి "స్వచ్ఛ వారియర్ అవార్డు" లభించింది. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, అలాగే స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండి, ప్రిన్సిపల్ సెక్రటరీ పురస్కారంను అందజేశారు. పరిశుభ్రత రంగంలో కృషి చేసి, సమాజానికి ఆదర్శంగా నిలిచిన టి.పద్మావతికి అవార్డు లభించడం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కు ఎంతో గర్వకారణమైందని ఈ సందర్భంగా అధికారులు, సహచరులు ఆమెకు అభినందనలు తెలిపారు.

## పరిమితులు దాటుతున్న ఉచితాలు

(మొదటి పేజీ తరువాయి)

కీర్తిని ప్రతి ఒక్కరూ నిలబెట్టాలన్నారు. ప్రజాప్రతినిధులపై ఉన్న క్రిమినల్ కేసులు రెండేళ్లలోపే విచారణ పూర్తి కావాలని కోరారు. ఇందుకోసం కోర్టుల సంఖ్య పెంచి, కొత్త జడ్జీలను నియమించాలని ప్రభుత్వాలకు సూచించారు. రాజకీయ వారసత్వానికి తాను ఎప్పటి నుంచో వ్యతిరేకమని స్పష్టం చేస్తూ, ప్రజాస్వామ్యంలో వారసత్వం కంటే ప్రతిభకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.

## సర్వోన్నత న్యాయమూర్తిపై దాడిని నిరసిస్తూ.. లాయర్స్ నిరసన

(మొదటి పేజీ తరువాయి)

లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అంకయ్య, కార్యదర్శి చుక్క రమేష్, సీనియర్ న్యాయవాదులు కుదుముల రవికుమార్ బద్దేపూడి రవీంద్ర, స్వర్ణ ప్రసాద్ పచ్చా కిరణ్ మాట్లాడుతూ.. న్యాయవాది సనాతన ధర్మం వర్ధిల్లాలి అని సుప్రీంకోర్టులో నినాదాలు చేయటం చట్ట విరుద్ధమైన చర్య అన్నారు. సనాతన ధర్మం పేరుతో న్యాయ వ్యవస్థపై, రాజ్యాంగ వ్యవస్థలపై దాడి చేయడం లాంటి సంఘటనను చూస్తూ ఊరుకోమని న్యాయవాదులు హెచ్చరించారు. సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ మీద దాడి సంఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో భారత రాజ్యాంగం వర్ధిల్లాలి, న్యాయ వ్యవస్థ వర్ధిల్లాలి, లౌకిక భారత వర్ధిల్లాలి.. అంటూ న్యాయవాదులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్షుడు ఎస్.అంకయ్య, నెల్లూరు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, సీనియర్ న్యాయవాది జల్లి పద్మాకర్, నెల్లూరు బార్ అసోసియేషన్ మహిళా న్యాయవాదుల రిప్రజెంటేటివ్ లక్ష్మమ్మ, సీనియర్ న్యాయవాదులు వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, వేళ్ళ ఉపేంద్ర, విజయమోహన్‌రెడ్డి, చేవూరు శ్రీధర్, దేవరాల వెంకటేశ్వర్లు, రాఘవ, స్వర్ణ ప్రసాద్, గంప సుధీర్, శివకుమార్, సుధీర్, సద్విన్, మోబీన, కుమార్ రాజా, చక్రధర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## కందమూరులో పశువుల గర్భకోశ పరీక్షలు




నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ : రూరల్ మండలంలోని కందమూరు గ్రామంలో గురువారం పశువుల గర్భకోశ పరీక్షలు, ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని కొత్త వెల్లంటి క్లస్టర్ పశు వైద్యాధికారి డాక్టర్ హరిబాబు తెలియజేశారు. ఈ అవకాశాన్ని కందమూరు గ్రామ పాడి రైతులు సద్వినియోగం చేసుకోవలసినదిగా తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రాంతీయ పశు వైద్యశాల అధికారి, పొదలకూరు, నెల్లూరు రూరల్ మండలంలోని పశు వైద్యాధికారులు పాల్గొనడం జరుగుతుందని తెలియజేశారు.

## వెంకయ్యనాయుడును కలిసిన సోమిరెడ్డి



వెంకటాచలం, మేజర్‌న్యూస్ : సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్వర్ణభారత్ ట్రస్టులో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. భేటీలో ప్రాంతీయ అభివృద్ధి, వ్యవసాయం, విద్యా రంగంపై చర్చ జరిగిందని ట్రస్టు వర్గాలు తెలిపారు.

# మృతుల కుటుంబాలకు కంచి ట్రస్ట్ లక్ష ఆర్థికసాయం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో ఇటీవల మృతిచెందిన 10కుటుంబాలవారికి 10వేలరూపాయలవంతున ఒక లక్షరూపాయలను శ్రీ సాంబశివచారిటబుల్‌ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డి తరపున ఆయన ప్రతినిధులు మంగళవారం అందజేశారు. నిత్యాన్నదాతగా, అనేక సామాజికసేవాకార్యక్రమాల ప్రదాతగా ఉన్న పరమేశ్వరరెడ్డి ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండున్నర సంవత్సరాలక్రితం నిత్యాన్నదానాన్ని ప్రారంభించి అందుకుగాను దాదాపు 65లక్షల రూపాయలతో అధునాతన భవనాన్ని కూడా నిర్మించి రోజుకు ఆరేడు వందలమందికి అన్నదానం అన్ని రకాల కూరలతో అత్యంత రుచికరంగా అందిస్తున్నారు. దాంతోపాటు ఆత్మకూరు పట్టణవాసుల ప్రయోజనార్థం ఒక శవయాత్రారథాన్ని తమ ట్రస్ట్ ద్వారా ఏర్పాటుచేశారు. ఐదు శవశీతలపేటికలను కూడా తమ ట్రస్ట్ ద్వారా సమకూర్చారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఎవరు మృతిచెందినా ఆ కుటుంబానికి మట్టిఖర్చులకోసం తమవంతుగా ట్రస్ట్ ద్వారా 10వేలరూపాయల వంతున ఆర్థికసాయమందిస్తున్నారు. టెన్త్‌లో ప్రతిభచూపి అధికమార్కులు సాధించిన విద్యార్థులకు 20వేలు, 15వేలు, 10వేలరూపాయల వంతున ప్రోత్సాహక నగదుపారితోషికాలను అందజేస్తున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను గౌరవిస్తూ వారిని సన్మానిస్తున్నారు. నిత్యం వేలాదిమంది ప్రయాణీకులు వేచి ఉండే ఆత్మకూరులోని మున్సిపల్ బస్టాండు, నెల్లూరుపాళెం కూడలివద్ద త్రాగునీరు లేక అందరూ అలమటిస్తుండగా గమనించిన కంచి పరమేశ్వరరెడ్డి సత్వరమే స్పందించి నిత్యంత వేలాదిమంది ప్రయాణీకులకు శీతలత్రాగునీటిని అందిస్తున్నారు. ఆత్మకూరులో ఇటీవల మృతిచెందిన 1వవార్డుకు చెందిన మొలబంటి మాలకొండయ్య, 2వవార్డుకు చెందినషేక్ అహ్మద్‌బాషా, 3వవార్డుకు చెందిన కల్లె చక్రప్ప, 5వవార్డుకు చెందిన షేక్ ఖాదర్‌హుస్సేన్, 7వవార్డుకు చెందిన సయ్యద్ ఖాసిమ్‌బీ, 9వవార్డుకు చెందిన పెళ్ళూరు విశ్వనాథం, 15వవార్డుకు చెందిన షేక్ సుల్తాన్‌మొహిద్దీన్,16వవార్డుకు చెందిన రాగిపెంచలమ్మ, 22వవార్డుకు చెందినవింజమూరు పెదరంగయ్య, 23వవార్డుకు చెందిన తురిమెర్లప్రభాకర్ కుటుంబాలను పరమేశ్వరరెడ్డి ప్రతినిధులు మల్లవరపు జయేంద్రప్రసాద్‌రెడ్డి, అచ్చోలు నారశింహారెడ్డిలు పరామర్శించి ఆయా కుటుంబాలకు 10వేల రూపాయలవంతున లక్షరూపాయలను అందజేశారు. ఆయా కుటుంబాలకు



కంచిపరమేశ్వరరెడ్డి అండగా ఉంటారని కూడా వారు భరోసా ఇచ్చారు. మృతిచెందిన అనేక పేదకుటుంబాల వారికి కంచి అందజేస్తున్న ఆర్థికసాయం ఎంతో వెసులుబాటుగా ఉంది. ఆయన దయార్ద్ర హృదయానికి అందరూ శతకోటి వందనాలు తెలుపుతున్నారు. ఇన్ని రకాలుగా సామాజికసేవలందిస్తున్న కంచి సేవలను సర్వత్రా కొనియాడుతూ ఆయనకు దైవబలం పెరగాలని, ఇంకా ఎన్నోరకాల సేవలు అందించాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు. సాయమందుకున్న మృతుల కుటుంబాలవారు పరమేశ్వరరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు ె ఆయా ప్రాంతాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కళాకారులకు సంక్షేమకార్యక్రమాలు అమలు చేయాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రంగస్థల, జానపద, పండిరిభజనల, తోలుబొమ్మలాటల, వీధిబాగవతంల కళాకారుల సంక్షేమాన్ని గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వమైనా తగు చర్యలు తీసుకోవాలని ,ప్రత్యేకంగా సంక్షేమ కార్యక్రమాలు అమలుచేయాలని ఆత్మకూరు ప్రాంతంలోని కళాకారులసంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. గత ప్రభుత్వం వద్ద ఎంతగా మొరపెట్టుకున్నా వృద్ధకళాకారులకు పెన్షన్లు, ఆర్టీసీబస్సుల్లో రాయితీ, కళాకారులకు గుర్తింపు కార్డుల మంజూరు, దేవాలయాల్లో, ఆధ్యాత్మిక కేంద్రాల్లో ప్రదర్శనలకు అవకాశం ఇవ్వకపోగా రంగస్థల వృత్తికళాకారులకు బ్రతుకుదెరువుగా ఉన్న చింతామణి నాటక ప్రదర్శనను నిషేధించారని వారు ఆవేదనతో తెలిపారు. గతంలో 15సంవత్సరాల క్రితం నెల్లూరు జిల్లాలో 560మందికి మాత్రమే వృద్ధకళాకారుల పెన్షన్ మంజూరు చేశారని, అనంతరం ఎంతగా మొరపెట్టుకున్నా 60సంవత్సరాలు దాటిన అర్హులు వందలాదిమంది ఉన్నా వారికి పెన్షన్ మంజూరు చేయలేదన్నారు. చింతామణినాటక ప్రదర్శనపై విధించిన నిషేధం రద్దుచేయాలని అరిచిగీపెట్టినా గత ప్రభుత్వం ఏమాత్రం పట్టిచుకొనకుండా పెడచెవినపెట్టిందన్నారు. కళాకారులకు గుర్తింపుకార్డులంటూ దరఖాస్తున్న స్వీకరించిన గత ప్రభుత్వం కార్డులివ్వనేలేదన్నారు. వయసుమీరిన అర్హులైన కళాకారులకు పెన్షన్లు మంజూరుచేయాలన్నా జిల్లాపౌరసంబంధాలశాఖకు దరఖాస్తులు చేసే అవకాశం కూడా గత ప్రభుత్వం ఇవ్వలేదని వారు ఆవేదనతో తెలిపారు. గుర్తింపు కార్డులుంటే ఏదేని ప్రదర్శనలకు వెళ్ళే సమయంలో ఎవరూ అడ్డుకొనకుండా ఉంటుందని భావించినా ఆకార్డులు ఇవ్వలేదన్నారు. ప్రదర్శనలకోసం వివిద ప్రాంతాలకు ప్రయాణాలు చేయాల్సి ఉన్నందున ఆర్టీసీ బస్సుల్లో రాయితీ ఇవ్వాలని కూడా కోరినా పట్టించుకోలేదన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా కళాకారుల వృత్తి ప్రాధాన్యతగా అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని, అందరు కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలని, ఆర్టీసీ బస్సుల్లో రాయితీ ఇవ్వాలని, కళాప్రదర్శనలే వృత్తిగా నమ్ముకొని సరైన అవకాశాలు లేక ఇబ్బందిపడుతున్నందున కళాకారుల ప్రదర్శనలకు దేవాలయాలు, ధార్మికసంస్థల్లో అవకాశం కల్పించాలని వారు నేటి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తామూ ప్రజలమేనని, ఓటర్లమేనని, తాము కూడా ప్రజాప్రతినిధులను ఎన్నుకున్నామని, అన్నివర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలుచేస్తున్న ప్రభుత్వం కళాకారులను కూడా ఆదుకోవాలని, తమ సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

## పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలకు ఆరోగ్యం : శ్రీదేవి




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పౌష్టికాహారంతోనే తల్లీ, బిడ్డల ఆరోగ్యం సక్రమంగా ఉంటుందని, రక్తహీనతకు గురికాకుండా పరిరక్షించబడతారని ఆత్మకూరు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ డి.శ్రీదేవి పేర్కొన్నారు. పోషణ్‌మా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మహిమలూరులో పోషణ్‌మా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత పర్యవేక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఈకార్యక్రమంలో అతిథిగా శ్రీదేవి పాల్గొన్న ప్రసంగిస్తూ పిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణీలు , బాలింతలకు పోషకాహార అవసరాలను గురించి వివరించారు. తగిన పోషకాహారం అందించడం ద్వారా పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. పిల్లల ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ఆమె వివరించారు. పోషణమాసం అవగాహనా కార్యక్రమాన్ని అన్ని సచివాలయాల్లో, పంచాయతీల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు. స్వస్తనారీ, స్వశక్తిపరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేయగా పరిశీలించిన శ్రీదేవి సదస్సులో పాల్గొన్న మహిళలకు చూపించి వివరించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు తగిన పోషకవిలువల ఆహారాన్ని , కోడిగ్రుడ్లు, బాలామృతం, పాలు తదితరాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నామని, వాటిని అందరూ సక్రమంగా వినియోగించుకోవాలని, దాంతోపాటు తమకు అందుబాటులో ఉన్న పోషకవిలువల ఆకుకూరలు, కూరగాయలు, అపరాలు తదితరాలను కూడా తీసుకోవాలని శ్రీదేవి కోరారు. తల్లీ,బిడ్డ ఆరోగ్యవతంగా ఉండేందుకు తప్పకుండా పోషకవిలువల ఆహారాన్ని తీసుకోవాలని, రక్తహీనతకు గురికాకుండా ఉండగలరని ఆమె పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ డి.శ్రీదేవితోపాటు అంగన్‌వాడీ కార్యకర్తలు కేశవరత్నమ్మ, నాగేశ్వరమ్మ, రాములమ్మ, సుజాత, అంగన్‌వాడీ కేంద్రాల సమాయకులు, పలువురు గర్భిణీలు, బాలింతలు, మహిళలు, చిన్నారులు, కిశోరబాలికలు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రీహోల్డ్‌భూములకు మోక్షం ఎన్నిటికో..

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం డిఫారం పట్టాలుగా ఇచ్చిన రైతులకు చెందిన భూములను శాశ్వతపట్టాలుగా (ఫ్రీహోల్డ్) మార్చగా నేటి ప్రభుత్వం వాటి ప్రక్రియను నిలిపివేసిందని, దాంతో పలువురి ఆశలు అడియాశలై నిరుత్సాహంగా ఉన్నారు. ఆ ఫ్రీహోల్డ్ భూములకు మోక్షం కల్గించాలని పలువురు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 20సంవత్సరాలకు క్రితం ప్రభుత్వం డిఫారం పట్టాగా రైతులకు ఇచ్చిఉంటే అలాంటివారికి ఫ్రీహోల్డ్ అంటూ వైసిపి ప్రభుత్వం పలువురు రైతులకు ఫ్రీహోల్డ్ అంటూ సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. ఈ సర్టిఫికేట్ ద్వారా ఆ భూములను విక్రయించుకోవచ్చుని, రిజిస్టర్ చేసుకోవచ్చని నిర్ణయించారు. దాదాపు రెండేళ్ళకితం ఈ సర్టిఫికేట్లు ఇవ్వడంతోపాటు ఆన్‌లైన్‌లో ఆయా పొలాలకు సంబంధించి 2023లో ఫ్రీహోల్డ్ చేయబడిందని నమోదు చేశారు. కానీ తీరా చూస్తే ఈ నూతన ప్రభుత్వం ఫ్రీహోల్డ్ అంశాన్ని పెండింగ్‌లో ఉంచింది. దాంతో ఆ సర్టిఫికేట్లు పొందిన రైతులు తీవ్ర నిరాశకుగురై ఆవేదన చెందుతున్నారు. తమకు 20సంవత్సరాలకు ముందు ఇచ్చిన డిఫారం పట్టాలు శాశ్వతపట్టాలుగా మారనున్నాయని సంబరపడ్డ రైతులు దిగాలు చెంది ఉన్నారు. ప్రభుత్వం ఈవిషయమై పరిశీలించిన కొత్తగా ఇవ్వకున్నా ఇప్పటివరకు ఇచ్చిన ఫ్రీహోల్డ్ అంటూ సర్టిఫికేట్లు ఇచ్చివారికి చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.ఈ విధానంలో గత ప్రభుత్వం అనేకఅవకతవకలకు, అక్రమాలకు పాల్పడిందని, పలువురి డిఫారం భూములను స్వాహాచేశారని, తదితర కారణాలతో ఈ ప్రభుత్వం నిలిపివేసిందని చెబుతున్నారు. కానీ సక్రమంగా అర్హులకలిగి డిఫారం పట్టాలు పొంది గత ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ అని సర్టిఫికేట్లు ఇవ్వబడిన నిజమైన రైతులకు ఈనిబంధనలు వర్తింపజేయాలని కోరుతున్నారు. గతంలో ఇచ్చిన ఫ్రీహోల్డ్ సర్టిఫికేట్లుతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళితే ప్రభుత్వం నిలిపివేసిందని, ఈ భూములు రిజిస్ట్రేషన్ కాజాలవని చెబుతున్నారు. ఇటీవల ఈ విషయమై ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో ఓ సమావేశం నిర్వహించినా ఫ్రీహోల్డ్ భూములకు మోక్షం లభించలేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు పరిశీలించి సక్రమంగా ఉన్న ఫ్రీహోల్డ్‌పొందిన భూములు రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

# విద్యార్థులకు జీఎస్టీపై అవగాహన




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి డివిజన్ పరిధిలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వస్తువులు వివిధ వాటిపై పన్ను, జీఎస్టి వ్యవస్థ పై సమగ్ర అవగాహన కార్యక్రమాన్ని విద్యార్థులకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్‌రావు హాజరయ్యారు. విద్యార్థులకు సూపర్ జీఎస్టి మరియు సూపర్ సేవింగ్ అనే అంశాలపై క్షుణ్ణంగా సందేశాన్ని వివరించారు. అనంతరం వరప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే విద్యార్థులు నేర్చుకున్న విషయాలను చిరకాలం గుర్తు ఉంటాయని, ఈ వయసులోనే దేశ ఆర్థిక వ్యవస్థకు మూలమైన జీఎస్టీ పై సరైన అవగాహన విశ్లేషణ పెంపొందించుకోవాలని తెలిపారు. దేశవ్యాప్తంగా జీఎస్టి ఎలా అమలు జరుగుతుందో అని వివరణ తెలిపారు. జీఎస్టీ కారణంగా వస్తువులపై పన్నుల్లో లభించే తగ్గింపు వివరాలను ఉదాహరణలతో సహా వివరించారు. పన్నుల వ్యవస్థ చరిత్రను వివరిస్తూ, 2017కు ముందు మన దేశంలో 17 రకాల పనులు, 13 రకాల శస్తులు సహా సుమారు 20రకాల పన్నుల వ్యవస్థ అమల్లో ఉండేదని తెలిపారు. ఈ 12 ఈ పన్నులన్నిటిని రద్దుచేసి విలువ ఆధారిత పన్నుల వంటి వ్యవస్థల స్థానంలో దేశం మొత్తం ఒకే పన్ను విధానం వన్ నేషన్ వన్ టాక్స్ నినాదంతో 2017 లో జీఎస్టీని ప్రారంభించారని తెలిపారు. జీఎస్టీ వ్యవస్థ ద్వారా వ్యాపారం సరళీకృతం పనుల ఎగవేత నియంత్రణ పారదర్శకత పెరిగాయని తెలిపారు. కొత్తగా తీసుకొచ్చిన సూపర్ జీఎస్టి సూపర్ సేవింగ్ అన్ని వర్గాల వారికి ఈ జీఎస్టీ గతం కన్నా అనుకూలంగా ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బండి. గోవిందయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సుజాత, వెంకటసుబ్బయ్య ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి, ఎంఈఎఫ్ నూతన మండల కమిటీ




**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండల కేంద్రంలో లక్ష్మీ విద్యానికేతన్ స్కూల్ ప్రాంగణంలో సైదాపురం మండలంలోని పలు గ్రామాలలో మాదిగలు అందరూ కూడా బుధవారం సాయంత్రం సమయంలో సైదాపురం లక్ష్మీ విద్యానికేతన్ స్కూల్ ఆవరణలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, ఇతర సంఘ నాయకులు అందరూ కలిసి నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గం సైదాపురం మండలంలోని ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ద్వారా మండల కమిటీలను ఎన్నుకోవడం జరిగింది. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి పటిష్టం చేసి మాదిగలను చైతన్య పరుచుటకు, రాజ్యాధికారం వైపు నడిపించడం గురించి ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పి సంఘాల ద్వారా పలు సలహాలు సూచనలు మండల కమిటీ నాయకులకు తెలపడం జరిగిందని సూరపాక ఉదయ్ కృష్ణ మాదిగ తెలిపారు. అందులో భాగంగా సైదాపురం మండలం నుండి మాదిగ నాయకుల సమీక్ష సమావేశం సైదాపురం లక్ష్మి విద్యానికేతన్ స్కూల్ నందు నిర్వహించారు. అయితే ప్రతి గ్రామంలో కమిటీ నాయకులుగా ఉన్నటువంటి కమిటీ నాయకులు అందరూ కూడా ఈ యొక్క మీటింగ్ లో పాల్గొనడం జరిగింది. అనంతరం ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద వెంకటేశ్వర్ మాదిగ ఆధ్వర్యంలో మండల కమిటీని వేయడం జరిగిందని మంగళ పూరి చిరంజీవి మాదిగ ఎంఈఎఫ్ మండల అధ్యక్షుడు తెలిపారు. అదేవిధంగా అక్టోబర్ 19వ తారీకున పద్మశ్రీ మందకృష్ణ మాదిగ విచ్చేస్తున్న సందర్భంగా ప్రతి మండలంలోని మాదిగలను చైతన్యపర్చుగా తీర్చిదిద్ది అక్టోబర్ 19వ తేదీ జరగబోవు మహాసభను జయప్రదం చేయాలని సురపాక ఉదయ్ కృష్ణ, డాక్టర్ ఆత్మకూరు వెంకట శేషు మాదిగ తెలిపారు. ఈ కార్యక్రమంలో సైదాపురం మండల కమిటీ నాయకులు, జాతీయ అధ్యక్షులు మంద వెంకటేశ్వర్ మాదిగ సూరపాక ఉదయ్ కృష్ణ మాదిగ పందెటి అంబేద్కర్ మాదిగ చింతకుంట అంకయ్య మాదిగ సర్వేపల్లి భాస్కర్ మాదిగ, నల్లిపాక వీరాగయ్య మాదిగ ఆత్మకూరు వెంకటేష్ మాదిగ మంగళ పూరి చిరంజీవి మాదిగ, అడసనపల్లి అంకయ్య మాదిగ తాళ్లూరు శ్రీనివాసులు మాదిగ, ఇతరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి




**అనంతసాగరం, మేజర్ న్యూస్ :** మండలం పాత దేవరాయపల్లి గ్రామంలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్త సద్ద మల్లికార్జునరెడ్డి మంగళవారం గుండెపోటుతో మరణించారు. సద్ద మల్లికార్జున రెడ్డి మృతి బాధాకరమని గ్రామ, మండల టిడిపి నాయకులు తెలిపారు. మల్లికార్జున మృతి పట్ల ఇతర పార్టీ నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మానవత్వం, మృదు స్వభావం సహాయం చేయాలనే తపన ఎప్పటికీ గుర్తుండిపోతాయని మల్లికార్జున రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామస్తులు తెలిపారు.

# విజయవాడకు తరలిన ఫ్యాప్టో నేతలు, కార్యకర్తలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** విజయవాడలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రవ్యాపిత ధర్నాకు ఆత్మకూరునుండి ఫ్యాప్టో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్ళారు. వారంతా బిఆర్‌టిఎస్ రోడ్డు ఉద్యమంలాగా తరలివచ్చి ప్రత్యేకవాహనాల్లో విజయవాడకు వెళ్ళారు. ఈసందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం సిపిఎస్ రద్దుచేయాలని, 10వతేదీనుండి హాజరు,మధ్యాహ్నభోజనం తప్ప ఎటువంటి యాప్‌లు బహిష్కరిస్తామన్నారు. పిఆర్‌సి కమిటీ వేసి 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, డిఏలు ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. వారంతా వందలాదిమంది ప్రత్యేక వాహనాల్లో విజయవాడకు తరలివెళ్ళారు.




# ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలోని వెంగళరావు నగర్ ప్రభుత్వ గ్రంథాలయ శాఖ ఆవరణంలో గ్రంథాలయ అధికారి బొమ్మల కోటేశ్వరి ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ శానిటైజేషన్ ఇన్స్పెక్టర్ డి.వి. నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు. యూట్యూబర్ రమణ కుమ్మర పాల్గొని వాల్మీకి చిత్రపటానికి అందరూ కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఆదికవి మహర్షి వాల్మీకి రామాయణాన్ని రచించి, ధర్మం మార్గాన నడవాలని తెలిపారు. అలాగే ఈ పవిత్రమైన రోజున ఆలయాలు దర్శించాలని పేద ప్రజలకు తోడును అందించాలని తెలిపారు. అలాగే మనం, రాబోవు తరంవారు కూడా వాల్మీకి ఆదర్శంగా జీవించాలని యువతకి పిలుపునిచ్చారు. అనంతరం గ్రంథాల అధికారి బొమ్మలు కోటేశ్వరి మాట్లాడుతూ.. బోయవాణిగా జన్మించి మహర్షిగా పరివర్తన చెంది, రత్నాకురులు లోకములో రామాయణం ఆధారంగా రచించారు. వాల్మీకి సందేశాలను నిత్యజీవంలో ఆచరణలో పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది వి.శివ, కే.బాబు, ఉద్యోగులు ఎం.సురేష్, వి.సుధీర్ డి.అరుణకుమార్ స్థానిక ప్రజలు పాఠకులు పాల్గొన్నారు.

## మాజీ కౌన్సిలర్‌ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**కావలి, మేజర్‌న్యూస్ :** ప్రమాదవశాత్తు 35 వార్డు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ లక్ష్మీ నరసింహ నెల్లూరు జికేఎస్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి జీకేఎస్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు వెళ్లి లక్ష్మీ నరసింహ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండమని తనకు, తన కుటుంబ సభ్యులకు తెలిపారు.

## రామాయణాన్ని రచించిన ఆదికవి వాల్మీకి : ఎంవీఐ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సమాజానికి సందేశాత్మక రామాయణాన్ని రచించిన ఆదికవి వాల్మీకిమహర్షి అని ఆత్మకూరు మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎం.రాములు పేర్కొన్నారు. వాల్మీకి జయంతిని మంగళవారం ఆయన తమ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి రాములు పూలమాల వేసి ఘనంగా నివాలులర్పించారు. ఈసందర్భంగా ఎంవిఐ రాములు ప్రసంగిస్తూ ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమినాడు రాష్ట్రపండుగగా వాల్మీకిజయంతిని జరుపుకుంటున్నామన్నారు. వాల్మీకిమహర్షి రామాయణాన్ని 23వేలశ్లోకాలతో 7ఖండాలతో రచించారని ఆయన వివరించారు. మానవజీవితాన్ని సంస్కరించగల మహాకావ్యం రామాయణం అని, అమ్మానాన్నల అనురాగం, పుత్రుల అభిమానం, అన్నదమ్ముల అనుబంధం, బార్యాభర్తలసంబంధం, గురుభక్తి, శిష్యానురక్తి, స్నేహఫలం, ధర్మబలం, వినయంతో ఒదగడం, వివేకంతో ఎదగడం తదితరాలుగా జీవిత పార్శ్యాలెన్నింటినో ఈ రామాయణ రచనలో చూపించారనిరాములు పేర్కొన్నారు. ప్రపంచసాహిత్యంలోనే ఆదికావ్యం రామాయణమన్నారు. వాల్మీకిమహర్షి రామాయణాన్ని రచించి ఆదికవిగా కీర్తిపొందారన్నారు. ఆయనను స్మరించుకోవడం సంతోషదాయకమని రాములు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రవాణాకార్యాలయ సిబ్బంది, పలువురు వాహనాల యజమానులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమ్మె కాలానికి జీతం ఇవ్వాలి




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు సిటీ పాత మున్సిపల్ ఆఫీస్ వద్ద నుండి ములుముడి బస్టాండ్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ, ధర్నా కార్యక్రమాన్ని మున్సిపల్ కార్మికులు మంగళవారం ఉదయం 6గంటల నుండి నిర్వహించారు. ఇచ్చిన మాట ప్రకారం సమ్మె కాలం జీతాలు ఇవ్వాలని, 60 సంవత్సరాల నిండిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, చనిపోయిన కార్మికులకు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, పనిచేసేందుకు అవసరమైన పనిముట్లు, పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ర్యాలీలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కత్తి శ్రీనివాసులు సిఐటియు నెల్లూరు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నెల్లూరు నగర అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ మనోజ్ కుమార్, ఎం.అశోక్‌లు మాట్లాడుతూ నెల్లూరు నగరపాలక సంస్థలో టెండర్ల రద్దు కోసం 15 రోజులు సమ్మె చేసి వాటిని రద్దు చేయించుకోవడం జరిగిందన్నారు. సమ్మె విరమణ సందర్భంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కమిషనర్ వైవో నందన్ సమక్షంలో చర్చలు జరిపి తరువాత స్పష్టమైన హామీలను మీడియా, కార్మికుల సాక్షిగా వారు వాగ్దానాలు ప్రకటించడం జరిగిందని అన్నారు. టెండర్లు రద్దు చేస్తున్నామని సమ్మె కాలం జీతం ఇస్తామని వాగ్దానం చేశారని అన్నారు. గత మూడు నెలల నుండి సమ్మె కాలం జీతం ఇవ్వాలని కార్మికుల తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిషనర్‌కు తెలియజేసినప్పటికీ లేఖల పేరుతో కాలయాపన చేయడం మంచి పద్ధతి కాదని విమర్శించారు. గతంలో 45 రోజుల సమ్మె చేసిన సందర్భంలో సమ్మె విరమణ చేసిన వెంటనే సమ్మె కాలం జీతం ఇచ్చారని తెలియజేసినప్పటికీ ప్రస్తుత కమిషనర్ మీనమేషాలు లెక్కించడం విడ్డూరంగా ఉందని ఇది పాలకుల వైఖరిగా స్పష్టం అవుతుందని విమర్శించారు. 93 మంది కార్మికులను 60 సంవత్సరాలు నిండియానే నెపంతో నిర్ధాక్షణ్యంగా పనిలో నిలిపివేశారని ఒక్క రూపాయి కూడా రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా పనిలో నిలిపివేయడం దుర్మార్గ చర్య అని విమర్శించారు. తక్షణమే వారిని యధాప్రకారం విధుల్లో కొనసాగించాలని,62 సంవత్సరాలకు రిటైర్మెంట్ వయసు పెంచాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికులకు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని జీవో ఉన్నా, నేటికీ అవి పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థలో ప్రైవేటు కాంట్రాక్టర్లకు పెద్దపీట వేసి కోట్ల రూపాయల ప్రజాధనం యదేచ్ఛగా దుర్వినియోగం అవుతున్నదని విమర్శించారు. పనిముట్లు మరియు పరికరాల కొనుగోలు పేరుతో కోట్లాది రూపాయలు డబ్బులు డ్రా అవుతున్నాయని కార్మికులకు మాత్రం పనిముట్లు ఇచ్చే పరిస్థితి కూడా కార్పొరేషన్ లో లేదని అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర పేరుతో పెద్ద ఎత్తున ప్రచార డబ్బాలు కొట్టుకుంటూ కార్మికుల సమస్యలు మాత్రం గాలికి వదిలేసారని విమర్శించారు తక్షణమే ఇచ్చిన మాట ప్రకారం సమ్మె కాలం జీతాలు ఇచ్చి కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నెల్లూరు నగర కార్యదర్శి బీపీ నరసింహ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నెల్లూరు నగర నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# ఆదర్శ పాఠశాలలో వన్యప్రాణి వారోత్సవాలు





**సీతారాంపురం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన సీతారామపురం ఆదర్శ పాఠశాలలో 71వ వణ్య ప్రాణి వారోత్సవాలు డిఆర్ఓ ప్రసాద్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అడవులను కాపాడుదాం వన్యప్రాణులను రక్షిద్దాం అనే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి మరియు అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు వన్య ప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం యొక్క ఆవశ్యకతను ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు తెలుసుకొని వారి తల్లిదండ్రులకు పరిసర ప్రాంత ప్రజలకు వివరించాలని కోరారు. అడవులు పచ్చగా ఉంటేనే మానవ మనుగడ మరింత ముందుకు పోతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలిపారు. అడవులలో అత్యంత విలువైన అటవీ వృక్ష సంపద ఉందని దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. మీ చుట్టుపక్కల అటవీ ప్రాంతాలలో వన్యప్రాణులను వేటాడుతున్న, అటవీ సంపదను నాశనం చేస్తున్న, వెంటనే సంబంధిత అధికారులకు తెలియపరచాలని కోరారు. రానున్న భావితరాలకు మంచి ఆహ్లాదకరమైన పచ్చదనం అందించాలన్న, జంతువులను చూడాలన్న వాటిని కాపాడుకుంటేనే సాధ్యమవుతుందని తెలిపారు. చెట్ల నుంచే సైన్స్ పుట్టింది అన్న విషయాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకొని ముందడుగు వేయాలని తెలిపారు. మన పూర్వీకులు ఆ రోజుల్లో ప్రతి జబ్బుకు చెట్ల పసరు, చెట్ల మూలికలు, వేర్లని వాడేవారని తెలిపారు. నేటి సమాజం దానిని మరిచి మందులకు బానిసలైపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు జెవి ప్రసాద్ గౌతమ్ కరిముల్లా ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు ఫరీద్, సందాని తదితరులు పాల్గొన్నారు.

# కలుగోల ఆలయంలో ప్రత్యేక పూజలు

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో మంగళవారం కలుగోల ఆలయంలో వైసీపీ బీసీ నేత ద్రోణాదుల వెంకట్రావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కావలి వైసిపి పట్టణ నాయకులు మున్సిపల్ కౌన్సిలర్స్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈరోజు జరిగిన కలుగోలమ్మ ప్రత్యేక పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి దంపతులకు, కావలి పట్టణ నియోజకవర్గ ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని ఎల్లప్పుడూ వారికి తోడుగా ఉండాలని ఈ కార్యక్రమాలు నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ కనుమర్లపూడి వెంకటనారాయణ వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి వైసిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# చైర్మన్, సభ్యులు ప్రమాణ స్వీకరణ



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని దేవరపాలెం గ్రామం వేదగిరి క్షేత్రం నరసింహకొండపై వేంచేసియున్న వేదగిరి లక్ష్మీ నరసింహస్వామివారి దేవస్థానం పాలకమండలి చైర్మన్, సభ్యులు ప్రమాణ స్వీకాంం తేదీ 08-10-2025 బుధవారం ఉదయం 9-00 గంటలకు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కార్య నిర్వహణ అధికారి వేమూరి గోపి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సభ్యులందరూ విచ్చేయవలసినదిగా ఆహ్వానించడం జరిగింది.

## నేటి నుంచి ఎస్‌జిఎఫ్ క్రీడాకారులు ఎంపిక

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన అనంతసాగరంలోని టీజేఎన్ ఉన్నత పాఠశాలలో బుధవారం నుంచి ఎస్‌జిఎఫ్ క్రీడాకారులు ఎంపిక చేయనున్నట్లు మండల కోఆర్డినేటర్ సూర గౌరీ రెడ్డి మంగళవారం తెలిపారు. అండర్ 17, అండర్ 14, వయసు కలిగిన బాలబాలికలు పోటీలలో పాల్గొనాలని తెలిపారు. కోకో, వాలీబాల్, కబడ్డీ, చెస్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ క్రీడా పోటీలు జరుగుతాయని తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొనవలసిందిగా తెలిపారు.

### సంతపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ..

# రెండు దారుణ హత్యలు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని సంతపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నూతన పెన్నా బ్యారేజ్ సమీపన తిక్కన్న పార్క్ వద్దా మంగళవారం రెండు దారుణ హత్యలు చోటుచేసుకున్నాయి. గుర్తు తెలియని దుండగులు వీరిని కర్రలతో రాళ్లతో కొట్టి హత్య చేసి పక్కన ఉన్న జాఫర్ సాహెబ్ కాలువలో పడేసినట్లు తెలుస్తుంది. మృతులు ఇద్దరు గిరిజనులు అంటున్న స్థానికులు. సమాచారం అందుకున్న టౌన్ డీఎస్పి సింధు ప్రియా, సంతపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ దశరథ రామారావు సంఘటన స్థలానికి చేరుకుని రెండు మృతదేహాలను వెలికి తీసి హత్య ఘటనలను పరిశీలించారు. ఈ సందర్భంగా టౌన్ డీఎస్పి సింధు ప్రియా మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తులు వీరిపై దాడి చేసి హత్య చేసి ఉంటారని, ఈ హత్య చేసిన వ్యక్తులను త్వరలోనే పట్టుకుంటామని కేసు రిజిస్టర్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె వివరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## వైస్ ప్రిన్సిపాల్ సునీల్ కుమార్ జన్మదిన వేడుకలు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక పుల్లారెడ్డి నగర్ వాస్తవ్యులు ఆర్య వైశ్యులు విశ్వదయ ఇంజనీరింగ్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ వీవీ సునీల్ కుమార్ జన్మదిన వేడుకలు వాసవి మాత ఆలయంలో ఆర్యవైశ్యుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కావలి పట్టణ ఆర్యవైశ్య అధ్యక్షులు తట్టవర్తి రమేష్ ఏఎంసీ చైర్మన్ అలేఖ్య దంపతులు, తట్టవర్తి వాసు, హాజరయ్యారు. అనంతరం మొదటిగా కేక్ కట్ చేసి ఆర్యవైశ్యులు అందరూ కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వాళ్లు మాట్లాడుతూ.. సేవా తత్పరుడు ఆర్యవైశ్యులకు ఏ సహాయం కావాలన్నా నేనున్నాను, అని భరోసా కల్పించే విషయంలో తనకు తానేసాటి అని, అలాగే టెన్త్ క్లాస్ ఇంటర్మీడియట్ లలో మంచి ప్రతిభ కనబరిచిన పేద ఆర్యవైశ్యులకు ప్రోత్సహించడంలో సహకరించిన వ్యక్తి వీవీ సునీల్ కుమార్ అని ఆర్యవైశ్యులు కొనియాడారు. రాబన్న రోజుల్లో ఆర్యవైశ్య పేదలకు వైద్యంలోనూ విద్యను అవసరమైన మేరకు సహాయం చేసేందుకు వారితో కూడా మేము కూడా ముందుంటామని ముక్తకంఠంతో తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఓరుగంటి రామకృష్ణ అనుమల శెట్టి శివ ఆర్యవైశ్య ప్రముఖులు, వాసవి మాత కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# స్మశాన వాటికల అభివృద్ధికి నిరంతర కృషి

## బుజబుజ నెల్లూరులో స్మశానవాటిక కర్మక్రతువుల భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి





**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 25వ డివిజన్, బుజబుజ నెల్లూరులోని స్మశానవాటికలో 10 లక్షల రూపాయలతో నిర్మించిన కర్మక్రతువుల భవనాన్ని ప్రారంభించి, మరో 10 లక్షల రూపాయలతో ప్రహరీగోడకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి,టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తదితరులు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ.. గత 11 సంవత్సరాలలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అనే తేడాలేకుండా స్మశానవాటికలు, కబరస్తాన్, సమాదులతోటలలో ప్రజలకు కనీసపాటి వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. కర్మక్రతువుల భవనం లేక అనేక సంవత్సరాలుగా బుజబుజ నెల్లూరులో ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 10వేల మందికి మేలుచేసే విధంగా దానిని నిర్మించి, ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, కార్పొరేటర్ బద్దెపూడి నరసింహా గిరి, డివిజన్ అధ్యక్షులు బైనబోయిన శేషు యాదవ్, టీడీపీ నాయకులు మాతంగి కృష్ణ, బ్రహ్మారెడ్డి, నగ్గల రాము, దొడ్డక రమేష్, హరి నాయుడు, షబ్బీర్, దూదల ప్రసాద్ రావు, పులి నాగేశ్వరరావు, గుంటి కృష్ణయ్య, కరీముల్లా, పోలయ్య, అశోక్, రాజా, మాబాషా, చెన్నకేశవ, సిద్దయ్య, జయరామరాజు, లక్ష్మణ్ రాజు, మాతంగి నరసింహులు, జమునమ్మ, ఇంద్రసేనమ్మ, పర్వీన్, సుహైనా, బీజేపీ నాయకులు మొగరాల సురేష్, జనసేన నాయకులు చిత్తలూరి సుందర రామిరెడ్డి, పావుజెన్ని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రీయ పోషణ మాసం మహోత్సవాల కార్యక్రమం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 16వ తేదీ వరకు 8వ రాష్ట్రీయ పోషణ మాసం మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా నెల్లూరు అర్బన్, రూరల్ ప్రాజెక్టు పరిధిలోని మంగళవారం 2వ డివిజన్ గుడిపల్లిపాడు మెయిన్ అంగన్వాడీ కేంద్రంలో నెల్లూరు అర్బన్, రూరల్ ఐసిడిఎస్ సూపర్వైజర్ శకుంతల ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం మహోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికంగా దొరికే కూరగాయలు, ఆకుకూరలు, సీజన్లో దొరికే పండ్లు తప్పకుండా తీసుకోవాలి. అలాగే మనం ప్రతిరోజు తీసుకునే ఆహారంలో పిండి పదార్థాలు, మొదలైనవి తీసుకోవడం వల్ల మంచి ఆరోగ్యం కలుగుతుందని తెలియజేశారు. అదేవిధంగా వివిధ రకాలైన వంటలు చేసి డిస్ప్లే చేశారు. అలాగే చుట్టుపక్కల ప్రదేశాలలో మొక్కలు నాటించారు. ప్రతి ఒక్కరు తమ ఇంట్లో కూరగాయలు, పండ్లు మొక్కలు పెంచుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయుడు వెంగయ్య, వీఆర్ఓ పెంచలయ్య, అంగన్వాడీ టీచర్ నీరజ, హైమావతి, సుభాషిని, కరీమున్నీసా, షబ్బు, ఉష, తల్లులు పాల్గొన్నారు.

# వైద్యాధికారుల సమ్మెకు సంఘీభావం తెలిపిన ఆశావర్కర్లు




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వైద్యాధికారులు సమ్మె చేస్తున్నందుకు వారి యొక్క న్యాయమైన హామీలు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వైద్యాధికారులకు, నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్య ఆరోగ్య సిబ్బంది అందరూ ఆషాడే రోజు భోజన విరామ సమయంలో సంఘీభావం తెలిపారు.

## కూరగాయల మార్కెట్లో..


# జీఎస్టీపై అవగాహన






**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని నెల్లూరు కూరగాయల మార్కెట్లో మంగళవారం జీఎస్టీ 2.0 సంస్కరణలపై అవగాహన నిర్వహించారు. నెల్లూరు ఏఎంసి చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న కూటమి ప్రభుత్వ పాలనలో జీఎస్టీ 2.0తో అన్నింటా ధరలు తగ్గి సామాన్య ప్రజలకు ఊరట లభించిందని తెలిపారు. వైస్ చైర్మన్ రాపూర్ శేఖర్, క్లస్టర్ ఇంచార్జి జలదంకి సుధాకర్ ఏఎంసీ డైరెక్టర్లు శివకుమార్, సాయి లక్ష్మణ్, సుధాకర్, బాబు, సురేష్, గునుకుల విజయలక్ష్మి, సురేఖ, ప్రసూన, శైలజ, మార్కెట్ సభ్యులు పాల్గొన్నారు.

# మహర్షి వాల్మీకి జయంతి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మహర్షి వాల్మీకి జయంతి వేడుకల కార్యక్రమాన్ని మంగళవారం తహసిల్దార్ కార్యాలయంలో అధికారులు ఘనంగా చేశారు. మండల తహసిల్దార్ స్వప్న వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడారు. హిందూ సంస్కృతి విషయంలో వాల్మీకి కావ్యాలు చరిత్రలో నిలిచిపోతాయని తాసిల్దార్ పేర్కొన్నారు. వాల్మీకి గొప్ప వ్యక్తిని తహసిల్దార్ తెలియజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్వేపల్లి పంచాయతీలో

# గిరిజన భూమిపై వివాదం




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం మండలం సర్వేపల్లి పంచాయతీ పరిధిలోని నాగంభొట్ల వారి కండ్రిగ గ్రామంలో గిరిజన భూమిపై ఉద్రిక్తత నెలకొంది. గడిచిన ప్రభుత్వాలు గిరిజనులకు పట్టాలు ఇచ్చి, ఎన్నో సంవత్సరాలుగా వారు సాగు చేసుకుంటున్న భూమిని విజయరాజు అనే వ్యక్తి తనదంటూ రోడ్డు వేసి విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభించాడని గిరిజనులు ఆరోపించారు.ఈ విషయం తెలుసుకున్న గిరిజనులు అక్కడకు వెళ్లి అడగగా, తమపై కేసులు పెట్టి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారని తెలిపారు. భూమి తమదేనని, తాము గిరిజనులమని, తహసీల్దార్ న్యాయం చేయాలంటూ వారు విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ, ఈ వ్యవహారంపై విచారణ జరిపి న్యాయం చేస్తామని, అంతవరకు ఇరు వర్గాలు భూమి జోలికి వెళ్లరాదని సూచించారు. గ్రామంలో పరిస్థితి ప్రశాంతంగా ఉన్నప్పటికీ, ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది.

## జడ్పీలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఒక బోయ కులంలో పుట్టిన వ్యక్తి మహర్షులచే జ్ఞానం పొంది, మహాకవిగా మారి ఆయన రామాయణం రచించారన్నారు. వారి బాటలో మనమందరం నడిచి, తెలియని విషయాలను కుణ్ణంగా తెలుసుకొని, ప్రతిభావంతులుగా మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని, కావున ప్రతి ఒక్కరు ఇప్పటి పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని, రాబోవు కాలంలో అందరికి ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ సిఈఓ కార్యాలయ పరిపాలనా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిఎస్టి పై అవగాహన సదస్సు



**ఏర్పేడు, మేజర్ న్యూస్ :** భారత ప్రభుత్వం 2025 లో జీఎస్టీ 2.0 సంస్కరణలను ప్రవేశపెట్టిందని పాపా నాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జీ.వి. ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఎన్.ఎస్.ఎస్. యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్మీడియట్ విద్యార్థులకు జీఎస్టీ పై అవగాహన సదస్సు ఉద్దేశించి మాట్లాడుతూ జీఎస్టీ లో మార్పులు రెండు పన్ను స్లాబులు మాత్రమే ఉంచబడ్డాయన్నారు. కళాశాల కామర్స్ అధ్యాపకులు డాక్టర్ జలగం రామాంజులు మాట్లాడుతూ 2017 లో జీఎస్టీ సంస్కరణ కమిటీ లో మన తెలుగువారైన కేంద్రఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్, జాతీయ చార్టెడ్ అకౌంటెంట్స్ అధ్యక్షుడు దేవరాజ రెడ్డి లు కృషి ఫలితంగా సంస్కరణలు అమలులోకి వచ్చాయన్నారు. 2025 జీఎస్టీ మలి విడత సంస్కరణల్లో భాగంగా ముందున్న నాలుగు స్లాబులకు బదులుగా, రెండు స్లాబుల్లో(5 శాతం,18 శాతం) తగ్గించడం వల్ల రైతులకు, అల్పాదాయ వర్గాలకు, విద్యా, వైద్య రంగాలకు గణనీయంగా జీఎస్టీ రేట్లు తగ్గాయి అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్. ఉమా, రాఘవరెడ్డి, వెంకట సురేష్, శ్రీమన్నారాయణ, శంకరప్ప, సువర్ణ, అమరేశ్వర రెడ్డి, షమీర్ , వై వి రాధ, ప్రసాద్, సాయి తేజ, సుధాకర్ రెడ్డి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కృష్ణ కిషోర్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇరకం దీవిలో ఘోర విషాదం
## పులికాట్ సరస్సులో నీటిలో పడి బాలుడు మృతి




**తడ, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని ఇరకం దీవిలో జరిగిన దుర్ఘటనలో ఆ గ్రామమంతా విషాదఛాయలతో అలుముకుంది. స్థానికుల వివరాలు మేరకు తమిళనాడు రాష్ట్రంలోని తిరువల్లూరు జిల్లా ఎన్నూరు కుప్పం ప్రాంతానికి చెందిన హేమరాజ్ తన తాతగారు ఊరైన ఇరకం దీవిలో శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవానికి వచ్చారు. సోమవారం సరదాగా బోటు షికారుకు తాతా, మనవడు వెళ్లడంతో మన కుప్పం వద్ద హేమరాజ్ బోటు నుండి జారిపడి పులికాట్ సరస్సులోని లోతైన నీటిలో మునిగిపోయాడు విషయం గ్రామస్తులు తెలియపరచడంతో విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే ఆ ప్రాంతానికి సుమారు 10, 15 పడవలతో చేరుకొని గజ ఈతగాల సహాయంతో గాలింపులు చేపట్టారు అయితే ఆ బాలుడు ఆచూకీ దొరకలేదు మంగళవారం ఉదయం బాలుడు మృతి చెంది నీటి పై తేలాడటంతో బాలుడిని గమనించిన గ్రామస్తులు బాల్నుడిని ఇరకం దీవికి తీసుకెళ్లారు దీంతో ఆ గ్రామమంతా దిగ్భ్రాంతికి గురి అయింది. తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు తీవ్రఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## శారదకి డాక్టరేట్



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** పద్మావతి మహిళా వర్సిటీ పరిశోధన విద్యార్థిని ఎన్ శారదకి డాక్టరేట్ ప్రధానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య అనురాధ తెలిపారు. ఈమె అసిస్టెంట్ ప్రొఫెసర్ డి సుజాత ఇన్స్టిట్యూట్ ట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ మార్గదర్శకత్వంతో ' ఎవాల్యూషన్ ఆఫ్ సెలెక్టెడ్ ఇండియన్ మెడిసినల్ ప్లాంట్స్ ఫర్ దైర్ అన్టి డయాబెటిక్ ఆక్టివిటీ విత్ ఇన్ విట్రో అన్డ్ ఇన్ వివో మెథడ్స్' అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించారు. ఇందుకుగాను పరిశోధన విద్యార్థిని ఎన్ శారదకి డాక్టరేట్ ప్రధానం చేసినట్లు వెల్లడించారు. ఆమెకు డాక్టరేట్ రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

## నవోదయ పరీక్ష దరఖాస్తులకు గడువు పొడిగింపు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** 2028–27 విద్యా సంవత్సరానికి 9వ, 11వ తరగతులలో జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశాల కోసం దరఖాస్తుల గడువును అక్టోబర్ 21 వరకు పొడిగించినట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నవోదయ ప్రవేశ పరీక్షకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ, అర్హతలతో పాటు మరిన్ని వివరాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు స్థానిక వరదరాజనగర్లోని "విశ్వం సైనిక్ – నవోదయ కోచింగ్ ఇనిస్టిట్యూట్"ను సంప్రదించవచ్చని, లేదా 8688888802, 9399976999 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

## కెనుమాకులపల్లి పంచాయతీకి స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర అవార్డు



**శాంతిపురం, మేజర్ న్యూస్:** మండలంలోని కెనుమాకులపల్లి గ్రామపంచాయతీకి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర అవార్డు దక్కింది. సోమవారం ఈ అవార్డును సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సర్పంచ్ ఏవి జయరాం, పంచాయతీ కార్యదర్శి ఎఎస్ స్వాతి అందుకున్నారు. ఇతర పంచాయతీ సర్పంచులు కెనుమాకులపల్లి ఆదర్శంగా తీసుకోవాలని సూచించినట్లు సర్పంచ్ తెలిపారు. పంచాయతీని మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏవి జయరాం మాట్లా డుతూ సి ఎం చేతుల మీదగా అవార్డు అందుకోవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఈ స్ఫూర్తితో మరింత అభివృద్ధికి పాటుపడతానన్నారు. పంచాయతీలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కొరత లేకుండా ఏర్పాటు చేశామన్నారు.. రానున్న రోజుల్లో పంచాయతీ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయడమే ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. ఈ స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో, పంచాయతీ సెక్రెటరీ ఎఎస్ స్వాతి, పంచాయతీ సర్పంచ్ ఏ వి జయరాం పాల్గొన్నారు.

## రామ్మూర్తి నాయుడు సంవత్సరికం కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

**– ముందుగా తల్లిదండ్రులకు నివాళి అర్పించిన సీఎం**
**– రామ్మూర్తి నాయుడు నారా రామ్మూర్తి నాయుడు స్మృతి వనాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి**
**– నారావారిపల్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించిన చంద్రబాబు**

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** రాష్ట్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి తన సోదరుడు దివంగత నారా రామ్మూర్తి నాయుడు సంవత్సరికం కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళవారం ఉదయం విజయవాడ నుంచి హెలికాప్టర్ లో తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం ఆరేపల్లి రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ లో దిగారు. అక్కడ టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పలువురి ఎమ్మెల్యేలు జిల్లా అధికారులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. రంగంపేట నుంచి రోడ్డు మార్గంలో స్వగ్రామమైన నారావారిపల్లెకి చేరుకున్నారు. స్వగృహానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పలు నాయకులు కార్యకర్తలు బంధువులు స్వాగతం పలికారు.

**ఇంట్లో సంవత్సరిక కార్యక్రమం....**

దివంగత నేత నారా రామ్మూర్తి నాయుడు మన నుంచి సంవత్సరం రోజులు గడుస్తున్న నేపథ్యంలో నారావారి పల్లి గ్రామం ముఖ్యమంత్రి స్వగృహంలో మంగళవారం సంవత్సరకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సీఎం సతీమణి నారా భువనేశ్వరి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తో పాటు, వారి కుటుంబ సభ్యులు, నారా రోహిత్ తదితరులు పాల్గొని రామ్మూర్తినాయుడు కి నివాళులు అర్పించారు. అనంతరం బట్టలు పెట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. రామ్మూర్తి నాయుడికి అతి సన్నిహితంగా ఉన్న నాయకులు కార్యకర్తలు పలువురు విచ్చేసి రామ్మూర్తినాయుడు కు నివాళులర్పించారు. తన నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన కుటుంబ సభ్యులు బంధువులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ర్యాలీగా తల్లిదండ్రుల సమాధుల వద్దకు వెళ్లిన సీఎం....**

ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన నివాసం నుంచి కార్యకర్తలు నాయకులు బంధువులు అధికారులతో కలిసి ర్యాలీగా ప్రజలకు అభివాదం తెలుపుతూ తన తల్లిదండ్రుల సమాధి వద్దకు వెళ్లారు. ముందుగా తండ్రి ఖర్జూర నాయుడు, తల్లి అమ్మన్నమ్మ సమాధుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళి అర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో పాటు మంత్రి లోకేష్, వారి కుటుంబ సభ్యులు ఖర్జూర నాయుడు అమ్మన్నమ్మ సమాధులకు నివాళి అర్పించారు.

**రామ్మూర్తినాయుడు స్మృతి వనాన్ని ప్రారంభించిన సీఎం**

దివంగత నాయకుడు నారా రామ్మూర్తి నాయుడు సంవత్సరికం సందర్భంగా మంగళవారం నారావారిపల్లెలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన తల్లిదండ్రుల సమాధుల సమీపంలో ఏర్పాటు చేసిన నారా రామ్మూర్తి నాయుడు స్మృతి వనాన్ని ప్రారంభించారు. రామ్మూర్తి నాయుడు సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళి అర్పించారు. ముఖ్యమంత్రితోపాటు రాష్ట్ర మంత్రి నారా లోకేష్, వారి కుటుంబ సభ్యులు నారా భువనేశ్వరి, నారా ఇందిరమ్మ, నారా రోహిత్ తదితరులు నివాళి అర్పించి ప్రత్యేక పూజలు చేశారు. వేదమంత్రాలతో సంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని లతో పలువురు ఎమ్మెల్యేలు తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## బోధనలో ఏఐ టెక్నాలజీని వినియోగించాలి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** డీఎస్సీలో ఇటీవల ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు విద్యార్థులకు ఏఐ టెకెన్నాలజీని వినియోగించి బోధన చేయాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీ శంకర్ పేర్కొన్నారు. విశ్వం స్కూల్ వేధికగా గత ఐదు రోజులుగా జరిగిన శిక్షణా కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ హాజరై పలు అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చారు. గౌరీ శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, డ్రాస్‌అవుట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. డీఈఓ కేవీఎన్ కుమార్ మాట్లాడుతూ తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు, వర్క్ స్టూడెంట్ అసెస్మెంట్ బుక్లెట్ అనుసంధానంగా బోధించాలన్నారు. పాఠశాలలో నిర్వహించాల్సిన రిజిస్టర్లపై సమగ్ర



అవగాహనతో శిక్షణ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి నరసింహులు, స్టేట్ అబ్జర్వర్ తో పాటు డివైఇవో మహేశ్వర రావు, ఎంఈఓలు బాలాజీ, జనార్ధన్ రాజు, ప్రేమలత, అసిస్టెంట్ అలెస్కా మీనాక్షి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి కేడీ సారధి పాల్గొన్నారు. సందర్భంగా ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించిన విశ్వం విశ్వనాథరెడ్డి, విశ్వచందన్ రెడ్డిని వారు అభినందించారు.

## సహజ పద్ధతిలో పెరటి తోటల పెంపకంలో సికె పేల్లి గ్రామ సమాఖ్య ప్రథమం

**– స్వచ్ఛ ఆంధ్ర అవార్డు అందుకుంటున్న ఏపీఎం, సంఘమిత్ర, వివో లీడర్**



**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రామచంద్రపురం మండలంలోని సికె పల్లి గ్రామ సమాఖ్య నందు ప్రకృతి పద్ధతులలో పెరటి తోటల పెంపకంలో డ్వాక్రా మహిళలు ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గ్రామ సమైక్యకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డును ఏపీ రాష్ట్ర గ్రీన్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్పర్సన్ జి నరసింహ యాదవ్, రాష్ట్ర నాయ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, డిఆర్డిఏ పిడి టీఎన్ శోభన్ బాబు డిపిఓ సుశీల దేవిలు సోమవారం వెలుగు ఏపీఎం. గురుమూర్తి,, గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు గీత, సంఘమిత్ర మునీశ్వరికు అందజేశారు. ఆగస్టు 20వ తారీఖున రాష్ట్రస్థాయి అధికారులు కిచెన్ గార్డెన్ సహజ పద్ధతులలో (పెరటి తోటల పెంపకం ) సికెపల్లి గ్రామ సమైక్య లోని డ్వాక్రా మహిళలు చేపట్టిన పెరటి తోటల పెంపకాన్ని పరిశీలించారు. రాష్ట్ర స్థాయి కమిటీ సభ్యులు పెరటి తోటల పంపకంలో సికె పల్లి గ్రామ సమాఖ్య డ్వాక్రా మహిళలు విషరహితమైన నాణ్యమైన కూరగాయలను, ఆకుకూరలను పండిస్తున్నారని ఆ మహిళలను అభినందించారు. సికె పల్లి గ్రామ సమాఖ్య కు స్వచ్ఛ ఆంధ్ర అవార్డు అవార్డు రావడం పట్ల మండల సమాఖ్య సభ్యులు, సంఘమిత్రలు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, డ్వాక్రా మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

## పులి శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు డెహ్రాడూన్ ఆర్మీ యూనిట్ సభ్యులు సన్మానం



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్ :** డెహ్రాడూన్ ఆర్మీ యూనిట్ డైమండ్ సెలబ్రేషన్ లో భాగంగా దేశ రక్షణ కొరకు తమ సేవలను అందించి రిటైర్డ్ అయిన మాజీ సైనికులను, వారి కుటుంబ సభ్యులను డెహ్రాడూన్ కు పిలిపించి వారు దేశానికి అందించిన సేవలు ఎప్పటికీ చరిత్ర పుటల్లో నిలిచిపోతాయని అభినందిస్తూ వారిని, వారి కుటుంబాన్ని పుష్కారాలతో సన్మానించారు. అందులో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోవున్న శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన పులి శ్రీకాంత్ కుటుంబాన్ని డెహ్రాడూన్ పిలిపించి, దేశానికి అందించిన సేవలను కొనియాడుతూ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారి కుటుంబాలను డెహ్రాడూన్ దగ్గరగా ఉన్న హరిద్వార్, రిషికేష్ పుణ్యక్షేత్రాలను దర్శించడానికి ఆర్మీ యూనిట్ ఏర్పాటుచేసి వారికి సకల గౌరవాన్ని కల్పించింది. ఈ సందర్భంగా మాజీ సైనికులు పులి. శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ విధంగా మాజీ సైనికులు పిలిపించి వారి సేవలను గుర్తిస్తూ ఇచ్చిన గౌరవాన్ని ఎప్పటికీ మరువలేమని చెప్పారు. తమను ఈ విధంగా పిలిచి మాజీ సైనికులను వారి కుటుంబాలను గౌరవించిన యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ అలావత్ కి, లెఫ్టినెంట్ కల్నల్. అజయ్ కుమార్ కి, సుబిదార్. మేజర్ అనిల్ , అప్పలరాజు, గ్లోరియస్ టు కుటుంబ సభ్యులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా మాజీ సైనికులు తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

# న్యాయమూర్తిపై దాడి సిగ్గుచేటు




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయి పై మతోన్మాద వైఖరితో లాయర్ దుర్మార్గంగా దాడి చేయడానికి ప్రయత్నించడాన్ని ఖండిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నెల్లూరు సిటీ గాంధీబొమ్మ సెంటర్లో నిరసన ర్యాలీ, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలందరూ ముక్తకంఠంతో దాడిని ఖండించాలని, భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలని, మతోన్మాదం నశించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చీఫ్ జస్టిస్ గవాయిపై దాడికి యత్నించడం భారత రాజ్యాంగ స్ఫూర్తి పై, భారత రాజ్యాంగాన్ని పరిరక్షించే వ్యవస్థపై దాడి చేయడమేనని అన్నారు. గడచిన కొన్ని సంవత్సరాలుగా భారత దేశంలో బిజెపి ఆర్ఎస్ఎస్ మూకలు సృష్టిస్తున్న మారణ హెూమం పరాకాష్ట స్థాయికి చేరుకున్నదని ఈ ఘటన తెలియపరుస్తున్నదని అన్నారు. సనాతన ధర్మం పరిరక్షణ పేరుతో దేశంలో అనేక మారణ హెూమాలు సృష్టిస్తున్నారని రాజకీయ లబ్ధిని పొందేందుకు మతాన్ని సున్నితమైన అంశాల్ని రెచ్చగొడుతూ ప్రజలలో చీలిక విభజనలు తెచ్చేందుకు నిరంతరం సృష్టిస్తున్నారని అన్నారు. విభిన్న మతాలు విభిన్న సంస్కృతులు సంప్రదాయాల కలయికతో భిన్నత్వంలో ఏకత్వం సాధించి ప్రపంచంలో అనేక దేశాలకు భారతదేశం స్ఫూర్తిగా నిలిచిందని అన్నారు. భారత రాజ్యాంగం కూడా అదే రకమైన స్ఫూర్తిని ప్రతిబింబించిందని అన్నారు. నేడు భారత రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తూ బిజెపి, ఆర్ఎస్ఎస్ మూకలు పేట్రేగిపోతున్నాయని అన్నారు. భారత ప్రజలు ప్రజాస్వామిక వాదులు లౌకికవాదులు ముక్తకంఠంతో చీఫ్ జస్టిస్ పై జరిగిన దాడిని ఖండించాలని కోరారు మతోన్మాదులు చేస్తున్న ప్రయత్నాలను ప్రజల ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి.సూర్యనారాయణ, నగర కమిటీ సభ్యులు బీపీ.నరసింహ, కత్తి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీమ్‌కోర్టు న్యాయమూర్తిపైదాడికి న్యాయవాదుల నిరసన



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సుప్రీమ్‌కోర్టు న్యాయమూర్తి గవాయ్‌పై ఒక న్యాయవాది కోర్టులోనే దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఆత్మకూరులో మంగళవారం స్థానిక న్యాయవాదులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో వారంతా ఎల్ఆర్‌పల్లి నుండి మున్సిపల్ బస్టాండువరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. బస్టాండు వద్ద వారు డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా బార్‌అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు ప్రసంగించారు. ఈదాడి అత్యంత హేయమని, న్యాయవ్యవస్థ, రాజ్యాంగం,లౌకికవాదం పరిరక్షణకై తాము ఈ నిరసన ప్రదర్శన నిర్వహించామన్నారు. భారత అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీమ్‌కోర్టులో ప్రధానన్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై న్యాయవాది రాకేష్‌కిషోర్ దాడి చేయడం అత్యంత హేయమన్నారు. ఈ దాడి కేవలం ఒక వ్యక్తిపై జరిగిందికాదని, భారత న్యాయవ్యవస్థ, రాజ్యాంగం, లౌకికవాదంలపై జరిగిన దాడి అని వారు పేర్కొన్నారు. మతోన్మాదం, అసహనం హద్దులు దాటి వ్యవస్థలపై దాడులకు పాల్పడుతున్న ప్రస్థుత పరిస్థితులను ప్రజలకు తెలియసేసేందుకు ఈ నిరసన కార్యక్రమం నిర్వహించామని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు శిరాజుద్దీన్, న్యాయవాదులు కె.వి.శేషారెడ్డి, ఎల్.వి.రమణయ్య, నందా ఓబులేశు, నజీర్, తిరుపతమ్మ, హరికృష్ణ, మధుసూధనరావు, మోదేపల్లి వెంకటేశ్వర్లు, మల్లికార్జున, బాబు, రహమతున్నీసా, ఇంకా పలువురు న్యాయవాదులు, పలువురు వివిద ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మహిళల ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం : సీడీపీఓ పి.సునీలత





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మహిళల ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యమని, అందుకుగాను సరికొత్త రాష్ట్రీయపోషణమా కార్యక్రమాన్ని రూపొందించగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గ్రామగ్రామాన, వాడవాడలా ముమ్మరంగా అవగాహన కల్పిస్తున్నామని ఆత్మకూరు ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత పేర్కొన్నారు. పోషణమాసోత్సవంలో భాగంగా మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి 2 అంగన్‌వాడీ కేంద్రంవద్ద సూపర్‌వైజర్ జి.కస్తూరి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన అవగాహనా సదస్సుకు సునీలత అతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా సునీలత మాట్లాడుతూ బాలికలు, గర్భిణీలు, బాలింతలు, మహిళలు, కిశోరబాలికలు తగినంతగా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటారని పేర్కొన్నారు. ఈసందర్భంగా స్థూలకాయం నివారణ, బాల్యదశ సంరక్షణ, విద్య, శిశు మరియు చిన్నపిల్లల అలవాట్లు, పిల్లల సంరక్షణలో పురుషుల భాగస్వామ్యం తదితర అంశాలపై సిడిపివో అవగాహన కల్పించారు. జిల్లా స్త్రీశిశుసంక్షేమశాఖ పి.డి బి.హేనాసుజన్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు, వారి పిల్లల ఆహారపు అలవాట్లుతోపాటు రోజువారీ దినచర్య, శారీరకశ్రమ,నిద్ర వంటి విషయాల్లో శ్రద్ధ వహించాలని ఆమె తెలిపారు. పిల్లల్లో మంచి ఆహారపుఅలవాట్లను ప్రోత్సహించాలని, జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉంచాలని, ఆరోగ్యకరమైన పౌష్టికాహరం అందించాలని, పిల్లలను అతిగా తిననివ్వరాదని, తినేటపుడు సెల్‌ఫోన్లు, టివిలకు దూరంగా ఉంచాలని ఆమె సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలద్వారా లభించే పౌష్టికాహారాన్ని లబ్దిదారులే తీసుకోవాలని, తమకు అందుబాటులో లభించే పోషకవిలువల ఆహారం గురించి పోషణమాసోత్సవాల ద్వారా అందరూ అవగాహన పెంపొందించుకోవాలని, తమ బిడ్డలకు సునీలత సూచించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన పౌష్టికాహార ప్రదర్శనను ఆమె తిలకించి వాటిని గురించి అందరికీ వివరించారు. తెలుగుమహిళ రాష్ట్ర కార్యదర్శి పులిమి శైలజారెడ్డి మాట్లాడుతూ మహిళలు, గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యపరిరక్షణకు , రక్తహీనతకు గురికుండా ఉండేందుకు తగింతగా పౌష్టికాహరం తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహరంతోపాటు తమకు అందుబాటులో లభించేలా పోషకవిలువల ఆహారాన్ని కూడా తీసుకోవాలని, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తల ఆరోగ్య సలహాలను పాటించాలని , అవసమైన వైద్యపరిక్షలు సకాలంలో చేయించుకోవాలని ఆమె కోరారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజ జి.కస్తూరి పోషణ్‌మా కార్యక్రమం గురించి ప్రసంగించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పి.రాధ, షేక్ షకీలా, ఆర్.సుప్రజ, జి.సుప్రజ, కె.రమణమ్మ, హమీదున్నీసా, పి.సుధారాణి, డి.పద్మావతి, కె.సుప్రజ, కేశవమ్మ, నీలిమ, సుజాత, సునీత, సాహేరా, నారాయణమ్మ, గుల్జార్, అరుణ, చెంచమ్మ, చెంచులక్ష్మి, పి.భవాని, కె.భవాని, చెంచులక్ష్మి, మాలతి, దొరసానమ్మ, గర్భిణీలు, బాలింతలు,మహిళలు, చిన్నారులు, వారి తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని పార్టీల నాయకులతో సమావేశం




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం నందు ఆర్‌డీఓ నాగ సంతోష్ అనూష ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించిన అన్ని పార్టీలు నాయకులు, ఏఈఆర్‌ఓలు, ఈడిటి నెల్లూరు రూరల్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలు నిర్మలందబాబా, చెన్నూడు, ఎలక్షన్ డిప్యూటీ తాసిల్దార్ షైక్ జమీర్ బాషా, ఎలక్షన్స్ సిబ్బంది ఈ సమావేశానికి హాజరు కావడం జరిగింది.

## విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం విద్యార్థులకు కనీససౌకర్యాలు కల్పించకుండా వారి ప్రాణాలతో చెలగాటమాడుతుందని ఆంధ్ర విద్యార్థిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లవరపు అశోక్‌రెడ్డి ఆరోపించారు. కురుపాం గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థుల మృతికి ఎవరు కారణమని ఆయన ప్రశ్నించారు. కనీససౌకర్యాలు కల్పించడంలో అధికారులు పట్టించుకోవడవం లేదన్నారు. పార్వతీపురంమన్యం జిల్లా కురుపాం గిరిజనగురుకుల పాఠశాలలో ఆర్వోప్లాంటు చెడిపోగా పట్టించుకోనందున కలుషిత నీరు త్రాగి ఇద్దరు విద్యార్థినిలు మృతిచెందారని ఆయన పేర్కొన్నారు. 611మంది చదువుతున్న ఈపాఠశాలలో ఇంత జరుగుతున్నా పట్టించుకోలేదని ఆయన ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## న్యాయమూర్తిపై దాడిని ఖండించిన జేవీవీ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సుప్రీమ్‌కోర్టు ప్రధానన్యాయమూర్తి బిఆర్‌గవాయ్‌పై రాకేష్ అనే న్యాయవాది దాడిచేయడాన్ని ఆత్మకూరు జనవిజ్ఞనవేదిక నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వానికి ప్రజాసంఘాల నిరసనను తెలియజేయాలంటూ వారు మంగళవారం స్థానిక ఆర్డీవో భూమిరెడ్డి పావనికి ఒక వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో జెవివి నాయకులు కె.సి.కృష్ణయ్య, సంధాని, సాధిక్‌హుస్సేన్, ఆవాజ్ నాయకులు పి.యస్దాని, డివైఎఫ్ఐ నాయకులు వాగాల శ్రీహరి, సిపిఎం పట్టణ కార్యదర్శి కె.డేవిడ్‌రాజు, జి.లక్ష్మిపతి, షేక్ అన్వర్, తదితరులు పాల్గొన్నారు.